

# నేరము - శిక్ష

Crime & Punishment


**"నిన్నొదిలి ఒక్క క్షణం కూడా వుండలేను..." ఆమె నుదుటిపై వాలిన ముంగురులను చూపుడు వేలితో సరిచేస్తూ అన్నాడు అతడు.**

**"పోదురూ బడాయి... ఈ హోటల్లోంచి బయటపడితేచాలు. మీరూ మీ భార్యా, పిల్లలూ మీ లోకమే వేరు. అప్పుడు హసీనా, హసీనా.. అని కలవరించే ఈ నవీనా మీకెక్కడ గుర్తుంటుంది...." బుంగమూతి పెట్టి అలకలు పోయిందా జవ్వని.**

**"నువ్వలా అలిగినప్పడే నీ బుగ్గలు మరీ ఎర్రబడతాయి. అచ్చు గులాబీల్లా..." అంటూ ఆ మసక చీకట్లో తమను ఎవ్వరూ చూడట్లేదనే ధైర్యంతో ఆమె బుగ్గల మీద ముద్దు పెట్టుకున్నాడతను.**

# వ్యామోహం

- ఆదిత్య



పిల్లి కళ్లు మూసుకొని పాలు తాగుతున్న చందాన వుంది వారి చర్య.

అయితే వీరినే గమనిస్తున్న మంకీ క్యాప్ మనిషి తన కెమెరా క్లిక్ మనిపించాడు.

ప్రేమ పారవశ్యంతో మునిగిన ఆ జంటకు ఇదేదీ కంటికి కనిపించలేదు.

"త్వరలోనే నిన్ను మా ఇంటికి సాదరంగా తీసుకెళతాను. అవును మా పాప ఎలా చదువుతోంది?"

"షి ఈజ్ ఫైన్... ఎంతైనా నీ కూతురే గా...." అమ్మో టైమ్ అవుతోంది బయలుదేరుదామా....

"పద... పద.." అంటూ హోటల్లోంచి బయట పడ్డారు ఇద్దరూ.

★★★

"మేడమ్ మీ అనుమానం నిజమే...." అంటూ ఓ కవర్ అందించాడు మంకీ క్యాప్ మనిషి.

కవిత ఆ కవర్ అందుకోని "మీ ఫీజ్.." అంటూ కొంత రొక్కం అందించింది. అతనో ప్రయివేట్ డిటెక్టివ్. అతను వెళ్లిపోయిన తరువాత ఆ కవర్లోని ఫోటోలు చూసింది. వాటిని చూస్తూనే కవిత మొహం ఎర్రబడింది.

తన భర్త ప్రశాంత్ రాసలీలకు ప్రత్యక్ష సాక్ష్యాలు ఆ ఫోటోలు. ఫైనల్ వార్నింగ్ ఇవ్వాలని నిర్ణయించుకొంది. ఎక్కడుందో ఏడేళ్ల పింకీ పరుగెత్తుకుంటూ వచ్చింది. ఆ ఫోటోలు పింకి కంటపడకుండా టేబుల్ సొరుగులో జాగ్రత్తగా దాచింది కవిత.

ఇంతలో కాలింగ్ బెల్ మోగడంతో తలుపు తెరిచింది. ఎదురుగా పింకీ ట్యూషన్ టీచర్. నవ్వుతూ ఆహ్వానించి పింకీ రూంలో కూర్చోబెట్టింది. స్టౌవ్ మీద టీకి నీళ్లు సలసలా మరుగుతున్నాయి. దాంతోపాటే ఆమె ఆలోచనలు సుళ్లు తిరుగుతున్నాయి. ఏమీ తెలియని నంగనాచిలా ఎలా వచ్చిందో. అసలు తన బంగారం మంచిది కానప్పుడు పరాయివాళ్లను అని ఏం లాభం? ముందు ప్రశాంత్‌ని కట్టడి చేస్తే చాలు అనుకుంటూ టీ కప్పులోకి వంపి తన భావాలేవీ కనపడకుండా జాగ్రత్త పడుతూ నవీనాకు టీ అందించింది.

రాత్రి పాపను పడుకోబెట్టిం తరువాత డ్రాయింగ్ రూంలో టీవిలో ఏక్తాకపూర్ సీరియల్ చూస్తున్న ప్రశాంత్ దగ్గరకొచ్చింది కవిత.

ఓ పొడి దగ్గు దగ్గి...

"ఎన్నాళ్ల నుంచి సాగుతోందీ భాగోతం..." సీరియస్‌గా అడిగింది కవిత.

ప్రశాంత్ టీవిలో సీరియల్ గురించి అనుకొని

''ఆరునెల్లుగా సాగుతోంది...'' ముక్తసరిగా సమాధానం చెప్పాడు.

''నేనడుగుతోంది టీవిలో భాగోతం గురించి కాదు. నీ భాగోతం గురించి....'' స్వరం పెంచింది కవిత.

''ఏమిటి? నువ్వు మాట్లాడుతోంది?'' ఆశ్చర్యంగా అడిగాడు ప్రశాంత్.

''నీ గురించే మాట్లాడుతున్నాను... నీకు ఆ టక్కులాడికి మధ్య సాగుతున్న భాగోతం గురించి అడుగుతున్నాను...''

''అలాంటిదేమీ లేదు... నువ్వేదో లేనిపోనివి ఊహించుకుంటున్నావు... వెర్రి భ్రమలో వున్నావు?''

''నిజమే నిన్నటి వరకూ నువ్వన్నట్లు ఊహల్లో, భ్రమలో వున్నాను. ఈనాడు నా భ్రమలన్నీ తొలగిపోయాయి. అందుకే అడుగుతున్నాను. నీకు, నవీనా మధ్య ఎంతకాలంగా సాగుతోందీ భాగోతం...'' అంటూ కుండబద్దలు కొట్టినట్లు అడిగేసింది కవిత.

ఆ మాటలు వింటూనే నిరుత్తరుడయ్యాడు ప్రశాంత్. అయినా ఇంకా వాదనకు దిగాడు.

''ఎవరో చెప్పిన మాటలు విని నా మీద అభాండం వేయడమేనా?''

''ఇంకా ఎందుకు బుకాయిస్తున్నావు. ఇది నిజమో కాదో తెలుసుకోకుండానే నీతో వాదనకు దిగడానికి నేనేం చదువు సంధ్యాలేని పాతకాలం ఆడదాన్ని కాదు. ఐ యామ్ ఏ పోస్ట్‌గ్రాడ్యుయేట్ యూనో...'' అంటూ చేతిలో వున్న కవర్ ప్రశాంత్ ముఖాన విసిరికొట్టింది.

అందులోంచి పడ్డ ఫోటోలను చూస్తూనే ప్రశాంత్ కాళ్ల కింద భూమి కదిలినట్లయింది. పళ్లు బిగపట్టి కోపంగా...

''రాక్షసీ... చివరకి నా వెనుక గూఢచారులను కూడా నియమించావా...?'' అరిచాడు ప్రశాంత్.

''నీ తెరవెనుక భాగోతం బయటపడాలంటే ఆ మాత్రం తెగువ చూపడం అవసరం. ఇంక వాదన అనవసరం. ఇప్పుడు చెప్పు జరిగిందంతా మర్చిపో. ఇక్కడితో ఈ అఫైర్‌కు ఫుల్‌స్టాప్ పెట్టు...''

''ఇంత వరకూ వచ్చిం తరువాత నా నిర్ణయం కూడా విను. నవీనాను వదులుకోవడం నా వల్ల కాదు...''

''ఓహ్... అంతవరకూ వచ్చిందా వ్యవహారం. అయితే దాని అంతు చూస్తాను...'' గిర్రున వెనక్కి తిరిగి బెడ్‌రూమ్‌లోకి వెళ్లిపోయి తలుపు ధడాల్న వేసి బెడ్ పై ఒరిగిపోయి వెక్కివెక్కి ఏడ్చింది కవిత. కన్నీటితో తలగడ తడిసిపోయింది.

పది నిమిషాల తరువాత ఆమె చెక్కిలిపై ఎవరిదో చెయ్యి కన్నీటిని సున్నితంగా తుడుస్తున్నట్లనిపించి ఉలిక్కిపడి కళ్లు తెరిచి చూసింది కవిత.

ఎదరుగా చిన్నారి పింకీ. కవిత కన్నీరు తుడుస్తూ ''ఏమయిందమ్మా....'' అంటూ అమాయకంగా అడగడం కనిపించింది. పింకీ సంగతే మరిచిపోయింది తను.

గబుక్కున పింకీని ఒళ్లోకి తీసుకొని ''ఇంకా నిద్దురపోలేదా తల్లీ...'' అంటూ ఓదార్చింది.

ఆ రాత్రి ఆ ఇంట్లో అందరికీ నిద్రలేని కాళరాత్రే అయింది.

* * *

పీ..పీ... అంటూ పోలీసు జీపు ఆ ఇంటి ఆవరణ ముందు ఆగింది.

ఎస్ఐ దివాకర్ తన బృందంతో జీపు దిగి ఆ ఇంట్లోకి ప్రవేశించాడు.

హాల్లో సోఫాలో ఇరవై ఏళ్ల యువతి నిర్లిప్తంగా పడి వుంది. గుండెలో తుపాకీ గుండు దిగి వుండడం వల్ల సోఫా అంతా రక్తంతో తడిసి వుంది.



ఆమెకు కొద్ది దూరంలో కుర్చీలో ప్రశాంత్ కూర్చుని వున్నాడు. అతని చేతిలో రివాల్వర్ వుంది. ఎస్ఐని చూస్తూనే...

''రండి ఎస్ఐ గారూ... మీ కోసమే ఎదురు చూస్తున్నాను. నవీనాను చంపిన హంతకుడిని నేనే...'' అంటూ చేతులు ముందుకు చాచాడు.

ఆ పక్కనే నిల్చున్న పనిమనిషి నాగమణిని ఎస్ఐ దివాకర్ పిలిచి ''ఈ హత్య జరుగుతున్నప్పుడు నువ్విక్కడే వున్నావా?'' అంటూ అడిగాడు.

రోజులాగే సాయంత్రం ఈ ఇంట్లో పనిచేయడానికి వచ్చాను. బెల్ నొక్కాను. తలుపు తెరిచేసరికి ఆ అమ్మాయి సోఫాలో పడి వుంది. ఈయన అక్కడ అలాగే నిల్చుని వున్నాడు...'' చెప్పింది నాగమణి.

పోలీసులు ప్రశాంత్‌ను అరెస్ట్ చేసి జీపులో పోలీస్ స్టేషన్‌కు తీసుకువెళుతుంటే... అప్పుడు ఎదురొచ్చింది కవిత. అయోమయంగా వెళుతున్న జీపు వైపు చూసింది. ఆ వెనుకే అంబులెన్స్‌తో నవీనా శవాన్ని తీసుకెళ్లడం చూసింది కవిత.

కంగారుగా ఇంట్లోకి అడుగుపెట్టింది. ఇంట్లో వున్న పనిమనిషి నాగమణి తను చూసిందంతా పూసగుచ్చినట్లు చెప్పింది.

అదంతా వింటూనే సోఫాలో కూలబడింది కవిత. ఆమెకు అంతా అయోమయంగా వుంది. నవీనా కోసం తనను వదులుకోవడానికి సిద్ధపడ్డ ప్రశాంత్ ఈ రోజు నవీనాను హత్య చేసాడంటే నమ్మశక్యం కాకుండా వుంది. ముందుగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ప్రశాంత్‌తో మాట్లాడితే గాని అసలు విషయం తెలియదు అనుకుని పోలీస్ స్టేషన్‌కి వెళ్లి ప్రశాంత్‌ని కలిసింది.

''ప్రశాంత్.... చెప్పు ఏం జరిగింది? నువ్వీ హత్య చేయలేదు కదూ... నిజం చెప్పు.... అసలేం జరిగింది?'' అంటూ నిలదీసింది.

''కవిత... నన్నేమీ అడక్కు.... నేను ఈ హత్య చేసాను. నీ మనసును క్షోభ పెట్టినందుకు నాకీ శిక్ష పడాల్సిందే...''

''ఫూల్‌లా మాట్లాడకు. కేవలం హత్య చేసానంటే సరిపోదు. ఎందుకు చేసావో కూడా తెలియాలి...''

''ప్లీజ్ కవితా నన్ను విసిగించకు... ఇంటికి వెళ్లు... పింకీ ఒక్కతే వుంటుంది. దాన్ని జాగ్రత్తగా చూసుకో వెళ్లు...'' అంటూ మొహం చాటేసాడు ప్రశాంత్.

పింకీ మాట వినగానే మారు మాట్లాడకుండా ''మీరు జాగ్రత్త. నేను మళ్లీ వస్తాను'' అంటూ ఇంటికి బయలుదేరింది కవిత.

★★★

స్కూలు నుంచి రాగానే తమ ఇంటికి రెండిళ్ల అవతల ఉన్న బంధువుల ఇంట్లో పింకీ వుంటుంది. వాళ్లింట్లో నిద్రపోతున్న పింకీని తీసుకొని ఇంటికి వచ్చింది. ఎందుకో పింకీ ఒళ్లు కాలిపోతోంది. పాలు తాగిద్దామని చూస్తే పింకీ ఏదో కలవరిచ్చింది.

''పింకీ లేమ్మా పాలు తాగి పడుకుందువు గాని...'' అంటూ పింకీని లేపింది. పింకీ ఉలిక్కిపడి కళ్లు తెరిచి చూసి...

''అమ్మా...'' అంటూ తల్లి మెడను వాటేసుకుని ఏదో కలవరిస్తోంది. ''నన్ను కాపాడమ్మా... ప్లీజ్...'' అంటూ ఇంకా ఏదేదో చెబుతూనే వుంది.

ఆ మాటలు వింటూనే కవిత గుండెఝల్లుమంది. ''లేదమ్మా నీకేం భయం లేదు... నేనున్నానుగా...'' సముదాయించింది.

మరునాడు ఉదయం గబగబా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఎస్ఐ దివాకర్‌ను కలిసి...

''సార్ నేను ప్రశాంత్ భార్య కవితను. మా వారు నిర్దోషి. ఆయన నవీనాను హత్య చేయలేదు...''

''అలాగా... మరయితే... ఎవరు హత్య చేసారంటారు? నువ్వు చేశావా?'' అంటూ సూటిగా అడిగేసరికి హడలిపోయింది కవిత. కాని ఒక్క క్షణం ఆగి ''ప్లీజ్... కొంచెం ప్రైవేట్‌గా మాట్లాడాలి.''

ఇద్దరూ బయటకు వెళ్లి అరగంట తరువాత తిరిగి వచ్చారు.

★★★

వారం రోజుల తరువాత...

ప్రశాంత్, కవిత, పింకీ ముగ్గురు గుళ్లో వున్నారు. పింకీ దూరంగా ఆడుకుంటోంది.

''ఇప్పుడు చెప్పు ఏం మాయ చేసావు? ఈ ప్రమాదంలోంచి ఎలా బయటపడ్డానంటావు?'' అడిగాడు ప్రశాంత్.

''నేను చేసిందేమీ లేదు. అది డబ్బు చేసిన మాయ''

''అవునూ... అంత డబ్బు నీకెక్కడిది?'' అంటూ కవిత వైపు తేరిపార చూశాడు. ఆమె మెడ, చేతులు బోసిగా కనిపించాయి. అది గమనించి పైట నిండుగా కప్పుకొంది కవిత.

''నాకు మీకన్నా, పింకీ కన్నా ఈ నగలేం ఎక్కువ కాదు.''

''అసలింతటి అనర్థానికి నేనే కారణం. ఏదో వ్యామోహంలో పడి మీమ్మల్నందరినీ క్షోభకు గురిచేసాను. నన్నెందుకు కాపాడినట్లు?''

''పింకీ కోసం... దానికి ఈ సమాజంలో తండ్రి అవసరం ఎంతో వుంది. అంతే కాదు తన వల్ల తన తండ్రి శిక్ష అనుభవిస్తున్నాడన్న భావం దానిలో బలంగా నాటుకుంది... అందుకే నీకు శిక్ష పడకుండా తప్పించడం తప్పనిసరైంది.''

''అంటే పింకీ తన టీచర్ నవీనాను తనే తుపాకీతో కాల్చానని చెప్పిందా?''

''స్పష్టంగా చెప్పలేదు కానీ... దాని కలవరింతలు, పలవరింతల్లో ఆ విషయం స్పష్టంగా గ్రహించాను. దాన్ని కాపాడ్డం కోసం ఆ నేరం నీ మీద వేసుకున్నావని అర్థం చేసుకున్నాను... అందుకే డబ్బుతో ఎస్ఐని లొంగదీసాను.

నవీనాది హత్య కాదు ఆత్మహత్య కేసుగా మార్చారు. జరిగిందంతా ఓ పీడకలగా మర్చిపోదాం. ఈ ఊరి నుంచి మకాం మార్చేద్దాం.''

కవిత చెప్పిన వాటన్నింటికి బుద్ధిమంతుడిలా తలూపాడు ప్రశాంత్.

ముగ్గురూ బయలుదేరుతుంటే కోవెల్లో జేగంట మోగింది.

★

